క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



సాధువులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ చిరంజీవి

ఆళ్లగడ్డ: ఆధునిక సమాజంలో ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆళ్లగడ్డ పట్టణ సీఐ చిరంజీవి అన్నారు. అహోబిలేశుడి ఉత్సవ పల్లకీ స్థానిక గంగమ్మ దేవాలయం సమీపంలోని తెలుపుపై కొలువైన సందర్భంగా మంగళవారం ఫొటో గ్రాఫర్ సుబ్బరాయుడు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్సవ పల్లకీ వెంట నడుస్తున్న యాచకులు, సాధువులకు ఆయన దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రతి ఏటా యాచకులు, సాధువులకు విందు భోజనం ఏర్పాటు చేసి, నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సుబ్బరాయుడు కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా సీఐ అభినందించారు.

సర్వేలు త్వరగా పూర్తి చేయాలి



సచివాలయాల సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

శిరివెళ్ల: హౌస్ మ్యాపింగ్, లాండ్ రికార్డులు, వ్యాపారస్తులపై చేస్తున్న సర్వేలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప సూచించారు. మంగళవారం వెంకటాపురం, యర్రగుంట్ల గ్రామ పంచాయతీలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో చిన్నచిన్న దుకాణాలను గుర్తించడంతో పాటు వ్యాపారస్తుల లావా దేవీలపై సమాచారం సేకరించాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. అలాగే గ్రామం వదిలి పెట్టిన, మరణించిన రైతుల వివరాలను సేకరించాలన్నారు. రేషన్ కార్డులలో పిల్లల వివరాలు పొందు పర్చాలని సూచించారు.

క్షుద్ర పూజల కలకలం

రుద్రవరం: మండల పరిధిలోని డీ కొట్టాల-శ్రీరంగాపురం గ్రామాల మధ్య తెలుగుగంగ కాల్వలో గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారు. మంగళవారం ఉదయం పొలం పనుల నిమిత్తం అటుగా వెళ్లే రైతులు దీనిని గమనించారు. సాగు నీరు అందించే కాల్వలు, ప్రజలు, రైతులు, కూలీలు నిత్యం తిరిగే ప్రదేశాల్లో ఇలాంటి క్షుద్ర పూజలు చేయడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన భజన కార్యక్రమం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై మమానందికి చెందిన ఎస్.రామన్నగౌడ్, బృందం వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గణేశ ప్రార్థన, నల్లమల కొండలలో, శ్రీశైలం శివ మయం, ఓం నమశ్శివాయ, నమో భూత నాథ, శివ శివ శంకరా, శ్రీశైల భ్రమరాంబా పలు భక్తి గీతాలను పరమేశ్వరాచారి, ఆవుల వెంకటేశ్వర్లు, మద్దిశెట్టి నాగేంద్రమ్మ, కొట్ల రాముడు, అమరేశ్వరాచారి, ఈశ్వరమ్మ, రామ కృష్ణ, రామన్నగౌడ్ తదితరులు ఆలపించారు.

కాపు కార్పొరేషన్ రుణాలకు యూనిట్ల మంజూరు

శిరివెళ్ల: మండలానికి 2024-25 కాపు కార్పొరేషన్ కింద 5 యూనిట్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ 3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు యూనిట్లు మంజూరయ్యాయని, వీటిలో 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంక్ రుణం ఉంటుందన్నారు. బలిజ, తెలగ, ఒంటరి కులాలు వారు మాత్రమే ఈ యూనిట్లకు అర్హులన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి వైద్య చికిత్స అందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ముఖ్యంగా క్యాజువాలిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో హెచ్ఓడీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించిన కొత్త లక్ష్యాలను మరింతగా పెంచి అమలు చేయాలన్నారు. ఈ-హాస్పిటల్ అమలులో పురోగతి సాధించాలని, ఇందులో ప్లాస్టిక్ సర్జరీ విభాగం మంచి ప్రతిభ కనబరిచిందని ప్రశంసించారు. త్వరలో ఆసుపత్రిలో మరో రెండు అదనపు ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో రక్త పరీక్షలకు సంబంధించి అన్ని కిట్లు ఉన్నాయని, అన్ని పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్యపరీక్షల విభాగానికి సంబంధించి ప్రత్యేకంగా ఒక అధికారిని నియమించినట్లు చెప్పారు. ఆసుపత్రిలో సగటున ప్రతిరోజూ ల్యాబ్‌కు 1700 నుంచి 2 వేల శాంపిల్స్, 6 వేల నుంచి 7వేల పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.



నంద్యాలలో సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు





కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో సామూహిక సూర్యార్చనలో పాల్గొన్న భక్తులు, మహాదేవపురంలో భగవద్గీతలు పంపిణీ దృశ్యం

వైభవంగా రథసప్తమి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): రథసప్తమి వేడుకలు నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో వైభవంగా నిర్వహించారు. స్వామి సూర్య ప్రభ వాహనంపై ఊరేగు తూ భక్తులకు దర్శనమిచ్చారు. నంద్యాల పట్టణంలో ఈ వేడుకలు కనుల పండువగా సాగాయి. సంజీవనగర్ రామాలయంలో శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ గణపతి హోమం, సుదర్శన, అరుణ హోమాలు నిర్వహించి మహాపూర్ణాహుతి గావించారు. అనంతరం సూర్య భగవానుడికి నైవేద్యం సమర్పించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో సూర్యదేవుడికి ముగ్గులతో సూర్య రథాన్ని ఏర్పాటు చేసి ఆది త్య హృదయం, సూర్యనమస్కారాలు నిర్వహించారు. సామూహిక సూర్యాష్టక శత నామావళి కుంకుమార్చన కార్యక్రమాన్ని చేపట్టి స్వామికి నవ విధ హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, సూరయ్య, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్య శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.



సంజీవనగర్ రామాలయంలో సూర్య భగవానుడికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



సూర్యనమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

భగవద్గీతల పంపిణీ

శిరివెళ్ల: రథ సప్తమి సందర్భంగా మంగళవారం మహాదేవపురంలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన త్రైత సిద్ధాంతి ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు ఇంటింటికి తిరిగి భగవద్గీతలు పంపిణీ చేశారు. ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరు చదివి ఆచరించాలన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యు లు సుభాషిణి, భాగ్యమ్మ, పుల్లమ్మ, ఖాదరు, శేఖర్, వెంకటేష్, లీలా నారాయణ పాల్గొన్నారు.

క్రీడా భారతి ఆధ్వర్యంలో..

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శాంతినికేతన్ సీబీఎస్సీ పాఠశాలలో మంగళవారం క్రీడా భారతి ఆధ్వర్యంలో రథ సప్తమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి, శాంతినికేతన్ విద్యాసంస్థల అధినేత సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యోగాసనాల సాధనతో శరీరానికి అవసరమైన శక్తితో పాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సూర్యోపాసనతో సర్వశక్తిమంతులమవుతామన్నారు. ప్రతిరోజు సూర్యోపాసన, సూర్య నమస్కారాలతో విద్యార్థుల్లో తేజస్సు, ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు మానసిక శారీరక రుగ్మతల నుంచి విముక్తి కలుగుతుందన్నారు. తర్వాత విద్యార్థులతో వివిధ రకాల యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిర్మల, హసీనా, నాగార్జున, సాయిశ్రీ, శశికళ, సుశీల పాల్గొన్నారు.

8న రాష్ట్రస్థాయి భజన పోటీలు

ప్యాపిలి: మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామంలో ఈ నెల 8వ తేదీ రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 108వ ఏకాదశి మహోత్సవం సందర్భంగా గ్రామ సమీపంలోని పంచలింగేశ్వర స్వామి దేవస్థానంలో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతగా నిలిచిన బృందానికి రూ. 20,016, ద్వితీయ స్థానం రూ.18,016, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 16,016 చొప్పున నగదు బహుమతి ఇస్తామన్నారు. నాలుగో బహుమతితో పాటు మొత్తం 12వ స్థానం వరకు నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న భజన బృందం ప్రవేశ రుసుం రూ. 300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 95501 03144 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇన్‌చార్జ్ ఏఓగా చంద్రశేఖర్‌రెడ్డి

ఉయ్యాలవాడ : మండల ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డిని నియమించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రాజేంద్రకుమార్ కోవెలకుంట్ల వ్యవసాయ కార్యాలయానికి బదిలీ అయ్యారు. చంద్రశేఖర్‌రెడ్డి ప్రస్తుతం నంద్యాల రైతు శిక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక నుంచి ఉయ్యాలవాడ ఇన్‌చార్జ్ ఏఓగా విధులు నిర్వహిస్తారని ఏడీఏ సుధాకర్ మంగళవారం వెల్లడించారు.

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా రమేష్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ వరుసగా మూడోసారి ఎన్నికయ్యారు. ఇటీవల నెల్లూరు జిల్లాలో సీపీఎం మహాసభలు జరిగాయి. అందులో రమేష్ కుమార్‌ను ఎన్నుకున్నట్లు పార్టీ పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కమనీయం.. కల్యాణోత్సవం



భద్రావతి భావనరుషి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



వేడుకను తిలకిస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని భద్రావతి భావనారుషి ఆలయంలో మంగళవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పవిత్ర గంగా జలాన్ని తీసుకొచ్చి స్వామి,అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. తర్వాత వేద పండితులు భావనారుషి స్వామి, భద్రావతిదేవి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భక్తజనం మధ్య ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల వేణుగోపాల్, కార్యదర్శి రోశయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైలు చార్జీల్లో 50శాతం రాయితీ ఇవ్వాలి



రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

నంద్యాల(న్యూటౌన్): 60 సంవత్సరాలు దాటిన వయో వృద్ధులకు రైలు చార్జీల్లో 50శాతం రాయితీ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల రైల్వే స్టేషన్ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగరాజు, శంకరయ్య మాట్లాడుతూ కుటుంబ సభ్యులపై ఆధారపడి జీవనం సాగించే వృద్ధులకు దూర ప్రయాణం చేయాలన్నా, పుణ్యక్షేత్రాలు దర్శించుకోవాలన్నా ఆర్థిక పరిస్థితి సహకరించదన్నారు. ఈ నేపథ్యంలో గతంలో ఉన్న రాయితీని కేంద్ర ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహమ్మద్‌గౌస్, సురేష్, వెంకటేశ్వర్లు, వీరసేన, తోటమద్దులు, భాస్కర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామికి మంగళవారం అత్యంత వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించారు. మాఘమాసం పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెల్లవారుజామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం 108 బంగారు పుష్పాలతో స్వామి వారికి అష్టోత్తర నామావళి నిర్వహించారు. మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితుడు శ్రీకాంత్‌శర్మ, సూరయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానంలో మంగళవారం ఉదయం అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు సమర్పించి ఒడి బియ్యం వేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ లక్ష్మీనారాయణ, వేదపండితులు రాఘవేంద్ర, మరణాచారి, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి, కాళికాంబాదేవి

రూ. 7,550తో కందుల కొనుగోలు



ఆర్.పాంపల్లెలో శనగ కోతలను పరిశీలిస్తున్న ఏడీఏ సుధాకర్

ఉయ్యాలవాడ : రబీలో సాగు చేసిన కంది దిగుబడులను ప్రభుత్వం మార్కెట్ యార్డుల ద్వారా క్వింటా రూ. 7,550కు కొనుగోలు చేస్తుందని ఏడీఏ సుధాకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఆర్.పాంపల్లె, కొండుపల్లె గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనగ పంట కోతలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇప్పటికే మండల పరిధిలో కాకరవాడ, ఆర్.జంబులదిన్నె, సుద్దమల్ల, బోడెమ్మనూరు, ఆర్.పాంపల్లె గ్రామాల్లో గ్రామ యూనిట్‌గా తీసుకుని బీమా కంపెనీ ప్రతినిధులతో కలిసి పంట కోత ప్రయోగాలు చేపట్టామన్నారు. ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయని, గత ఏడాదితో పోలిస్తే ఈసారి శనగ దిగుబడులు బాగా తగ్గాయన్నారు. పంట మార్పిడి చేస్తే రైతులకు ప్రయోజనం ఉంటుందని, దిగుబడులు పెరుగుతాయని తెలిపారు.

మహానందయ్య ఫొటో తొలగింపుపై విమర్శలు

మహానంది: మహానంది ఆలయ అభివృద్ధిలో నంద్యాలకు చెందిన భైరవజోష్యుల మహానందయ్య పాత్ర ఎంతో కీలకం. నల్లమల అటవీ ప్రాంతంలో వెలిసిన మహానంది అంటే ఎవరికీ తెలియని రోజుల్లో ఆయన నిత్యం ఎడ్లబండిపై నంద్యాల నుంచి వస్తూ మహానందీశ్వరస్వామికి పూజలు నిర్వహించేవారు. 1902 నుంచి 1947 వరకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తగా మహానందయ్య పనిచేశారు. మహానందీశ్వరస్వామి ఆలయంతో పాటు కోదండ రామాలయం, అమ్మవారి ప్రాంగణాల్లో శిల్పాలను చెక్కిన శిల్పులకు తన భూములను బహుమతిగా ఇచ్చిన మహానుభావుడు. అంతే కాకుండా ఇప్పుడున్న ఆలయం మొత్తం ప్రాంగణంలోని సుమారు 55 ఎకరాల భూమి ఆయన విరాళంగా ఇచ్చినదే. అలాంటి మహనీయుని ఫొటో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్ కార్యాలయానికి వచ్చిన సందర్భంలో మహానందయ్య చిత్రపటాన్ని చూసి ఎవరు ఈయన, ఎందుకు ఉంచారు, తొలగించాలని ఆదేశించారు. అయితే అక్కడున్న వారు ఆయన గురించే చెప్పే ప్రయత్నం చేయడంలో విఫలం కాగా, విలేకరులు వివరించే ప్రయత్నం చేసినా.. ఇలాంటి వారు ఎంతో మంది ఉంటారని, వెంటనే తొలగించాలన్నారు. అయితే ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దేవస్థానం అధికారులు స్పందించి తిరిగి ఆయన చిత్రపటాన్ని యథాస్థానంలో చేర్చారు.



మహానందయ్య ఫొటోను యథాస్థానంలో ఉంచిన దృశ్యం

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో దళితుల సమస్యలు గుర్తించాలి

- జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి, చిత్రంలో ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణ, జేసీ విష్ణుచరణ్

నంద్యాల: ఎస్సీ ఎస్టీ కాలనీల్లో నూతనంగా ఎంపికైన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు సందర్శించి దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల్లో అత్యాచారానికి గురైన వారిని సత్వర న్యాయం అందించడంతో పాటు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేదలకు ఎస్సీ,బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆసక్తి గల నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ పరిధిలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో టాయిలెట్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులపై ఆరా తీయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ బ్యాక్ ల్యాగ్ వివరాలు తెప్పించుకోవాలన్నారు. నంద్యాల పట్టణంలో బొమ్మల సత్రం అంబేడ్కర్ విగ్రహ చుట్టు సుందరీకరణ, మున్సిపల్ టౌన్ హాల్ లేదా చిన్న చెరువు కట్ట ప్రదేశంలో బాబాసాహెబ్ విగ్రహ ఏర్పాటుకు వారంలోగా ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసులను దాదాపుగా క్లియర్ చేశామన్నారు. నిజ నిర్ధారణ కేసులకు శిక్ష పడితే నేరాలు తగ్గుముఖం పడతాయని ఆయన తెలిపారు.

సఫాయికర్మాచారుల సమస్యలను పరిష్కరిస్తాం

పారిశుద్ధ్య కార్మికుల జీతభత్యాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. మున్సిపాలిటీ, ఆస్పత్రులు, దేవాలయాల్లో పారిశుద్ధ్య కార్మికులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ జఫ్రుల్లా , కమిటీ సభ్యులు బాల నాగన్న, నాగరాజు, కాశన్న, దేవదానం, రవికాంత్ బాబు, రమేష్ నాయక్, వెంకటేష్ నాయక్, నాగ నవీన్, మురళీ, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈ రోజు

ఓంకారంలో బహిరంగ వేలం

బండి ఆత్మకూరు : మండల పరిధిలోని ఓంకార క్షేత్రంలో వ్యాపార సముదాయాల నిర్వహణ కోసం బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నాగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ప్రారంభానికి ముందు రూ.10 వేల డిపాజిట్ చెల్లించాలన్నారు.

స్పోర్ట్స్

కరాటే, తైక్వాండో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు తైక్వాండో, కరాటే పోటీల్లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ హేమంతకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 101 ప్రభుత్వ, మండల పరిషత్, ప్రాథమిక పాఠశాలలో 6 నుంచి 8 తరగతులు చదువుతున్న 2530 మంది విద్యార్థినులకు, 294 జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో 6 నంచి 9 తరగతులు చదువుతున్న 34,953మంది విద్యార్థినులకు రాణి లక్ష్మీబాయి సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం కింద ఈనెల 15వ తేదీ వరకు యుద్ధ కళల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వివరాలకు నంద్యాల జిల్లా వెబ్‌సైట్ apssndy136 @gmail. comను సంప్రదించాలని సూచించారు. పూరించిన దరఖాస్తులను ఈనెల 6వ తేదీలోగా ఏపీ సమగ్ర శిక్ష కార్యాలయంలో నేరుగా అందజేయాలన్నారు.

విద్యార్థుల ప్రతిభ

బేతంచెర్ల: కాకినాడలోని జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలో జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 2 తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో బేతంచెర్ల విద్యార్థులు ప్రతిభ చాటారు. జయ ప్రతిక్, పూర్ణేంద్ర వెండి పతకాలు, దివ్యశ్రీ, దినేష్ కాంస్యం, వినూక్, కుషాల్ త్రివేద్ రెడ్డి, నోయల్ రన్నర్‌గా నిలిచారని కరాటే కోచ్ నాగన్న, మాస్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

9న యోగా ప్రీమియర్ లీగ్

కర్నూలు (టౌన్): నగర శివారులోని వేదస్ పాఠశాల ప్రాంగణంలో ఈనెల 9వ తేదీన 1వ రాష్ట్రస్థాయి యోగా ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి పదేళ్లలోపు వారు మొదటి కేటగిరీ, 10 – 12 ఏళ్ల వారు రెండవ కేటగిరీ, 12 – 14 ఏళ్ల వారు మూడవ కేటగిరీ, 14 – 16 ఏళ్ల వారు నాలుగవ కేటగిరీ, 16 – 19 ఏళ్ల వారు ఐదో క్యాటగిరీ, 19 – 29 ఏళ్ల వారు ఆరో కేటగిరీ అలాగే 45 సంవత్సరాల పైబడిన వారిని మరో కేటగిరీగా పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 93913 47212 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ముందస్తు పరీక్షలతో క్యాన్సర్ నుంచి రక్ష



క్యాన్సర్‌పై అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు



ఆలమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: ముందస్తు పరీక్షే క్యాన్సర్ నుంచి రక్షణ ఇస్తుందని మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ముఖేష్ అన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యులతో కలిసి వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, తొలి దశలోనే ఈ వ్యాధిని గుర్తించి తగిన వైద్యం చేయించుకుంటే ప్రాణాపాయం ఉండదన్నారు. స్మోకింగ్ 15 రకాల క్యాన్సర్లకు కారణమవుతుందని, అందుకే ధూమ పానం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలు చేయించుకోండి

రుద్రవరం:ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ నుంచి రక్షించుకోబడతామని ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసన్న లక్ష్మి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆలమూరు పీహెచ్‌సీని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ పీహెచ్‌సీ వైద్యులు అమర్నాథరెడ్డి, గాయత్రిలతో బాటు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్క్రీనింగ్‌తోనే క్యాన్సర్‌పై విజయం సాధ్యమని ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యార్థులకు అనుకూలంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ఉండాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గోర్ల సుధాకర్

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులకు అనుకూలంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ఉండాలని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గోర్ల సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ విద్యార్థి నష్టపోకుండా అందరికీ ఆమోదయోగ్య పద్ధతిలో నిర్ణయాలు ఉండాలన్నారు. ఎస్ఎంసీ తీర్మానం జరిపి ప్రతి గ్రామ పంచాయతీలో ఒక మోడల్ ప్రాథమిక పాఠశాల ఉండేలా మండల విద్యాధికారులు చొరవ చూపాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని అమలు చేసి మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు రాము, కార్యదర్శి రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ ఆత్మహత్య

గోస్పాడు: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. బాలహుసేని, మాదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా బాల హుసేని మానసిక ఆరోగ్య పరిస్థితి సరిగా లేదు. దీనికితోడు మూడేళ్ల క్రితం కుమారుడు చనిపోయాడు. వరుసగా జరిగిన ఈ సంఘటనలతో మాదేవి మానసిక వేదనకు గురై మంగళవారం తెల్లవారుజామున పేడరంగు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వెంటనే కుటుంబసభ్యులు గుర్తించి నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడలిపై కత్తితో దాడి

దొర్నిపాడు: కోడలిపై మామ కత్తితో దాడి చేసిన ఘటన మండలకేంద్రం దొర్నిపాడులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు .. మంగళవారం కోడలు ఓబులమ్మ కూరగాయల సంతకు వెళ్లి వస్తుండగా అప్పటికే కత్తితో మాటు వేసిన మామ ఓబులేసు వీపుపై పొడిచాడు. దీంతో ఆమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే ప్రాథమిక వైద్యపరీక్షల అనంతరం ఆళ్లగడ్డకు తరలించారు. ఈ దాడికి గల కారణాలపై వివరాలు తెలియాల్సి ఉంది. కాగా దీనిపై దొర్నిపాడు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పెళ్లికి వెళ్తే.. ఇల్లు గుల్ల చేశారు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని అవుకుమెట్ట బిల్డింగ్ కాలనీలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు.. స్థానికంగా నివాసం ఉంటున్న పోలూరు వెంకటకృష్ణ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి నంద్యాలలో బంధువుల వివాహానికి వెళ్లారు. ఆయన కుమారుడు ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. సోమవారం రాత్రి కింది ఇంటికి తాళం వేసి సెకండ్ ఫ్లోర్‌లో సాగర్ నిద్రించాడు. దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉంచిన రూ.80 వేల నగదు, ఒకటిన్నర తులం బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. సాగర్ నిద్రిస్తున్న గదికి గడియ పెట్టి తమ పని కానించారు. అనంతరం ఇంట్లో ఉన్న కోడి గుడ్లతో ఆమ్లెట్ వేసుకుని తిని అక్కడి నుంచి వెళ్లారు. మంగళవారం జరిగిన విషయం గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.